రుణమాఫీ వందశాతం జరిగిందా..?

- ఎక్కడ అయిందో నిరూపించాలి
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సవాల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 3 : రైతులందరికీ రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ జరిగినట్లు నిరూపించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే స్వగ్రామం శివారెడ్డిపల్లిలో 100% రుణమాఫీ జరిగిందా అని ప్రశ్నించారు. సోమవారం పరిగిలోని తమ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులు దాటినా.. ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్క దానినీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికెళ్లినా కేసీఆర్, కేటీఆర్‌లను తిట్టడం తప్ప ప్రజలకు ఏమి చేస్తారో చెప్పడం లేదన్నారు. ఇటీవల దాస్యనాయక్‌తండాలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాటలను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తప్పు పట్టడం సరికాదన్నారు. ప్రశ్నించుమని అంబేద్కరే చెప్పారని, ప్రజల తరఫున ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు నెరవేరే వరకూ ప్రశ్నిస్తూనే ఉంటామని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల కోసం జైలుకెళ్లేందుకు సిద్ధమైనన్నారు. ఎవరు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపడం ఒక్కటే కాంగ్రెస్ చేస్తున్న పని అని, కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది తప్ప అభివృద్ధి, సంక్షేమంపై ఈ ప్రభుత్వానికి సోయిలేదని, హామీల అమల్లో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు.

కేసీఆర్ హయాంలో ఏడాదికి ఎకరానికి రూ.పది వేలు ఇస్తే ..తాము అధికారంలోకి రాగానే రూ.15 వేలు ఇస్తామని చెప్పి పవర్‌లోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటివరకు రెండు పంటల పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిందని మండిపడ్డారు. జనవరి 26న సెలవు రోజు కావడంతో ఉదయం వరకు రైతుల ఖాతాల్లో రైతుభరోసా జమ చేస్తామని ప్రకటించి, చివరకు మండలానికి ఒక గ్రామంలోని రైతులకే వేశారన్నారు. కొన్నేండ్లుగా కొనసాగుతున్న ఈ పథకానికి మళ్లీ పైలట్ గ్రామం పేరిట కొత్త నాటకానికి కాంగ్రెస్ తెర తీసిందన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను రేవంత్ సర్కార్ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. కేసీఆర్ అంటేనే ఒక చరిత్ర అని స్పష్టం చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ వచ్చిందని, అంబేద్కర్‌ను గౌరవించే కేసీఆర్ హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఆ విగ్రహం దగ్గర నివాళులు అర్పించలేదన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవిందరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు రాజేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అశోక్‌వర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, మాణిక్యం, మౌలానా, తాహెర్‌అలీ, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

శాఖల వారీగా ఖాళీల వివరాలివ్వాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

భూములిస్తే ఒకే విడతలో పరిహారం

ధారూరు/వికారాబాద్, ఫిబ్రవరి 3 : వికారాబాద్ జిల్లాలో శాఖల వారీగా ఉన్న ఖాళీ పోస్టుల వివరాలను సమర్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల్లో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి వివరాలను రోస్టర్ పాయింట్ వారీగా వెంటనే సమర్పించాలన్నారు. ప్రజావాణిలో 106 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రజావాణిలో కారుణ్య నియామకాలు, ఇందిరమ్మ ఇల్లు, పింఛన్, రైతు భరోసా, రైతుల పంట రుణాల మాఫీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని.. వాటిని క్షుణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్/వికారాబాద్ : ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ దుద్యాల మండలంలోని హకీంపేట గ్రామ రైతులతో అసైన్డ్ భూములకు సంబంధించి మాట్లాడారు. భూ సేకరణలో ఉన్న అభ్యంతరాలు తదితర అంశాలపై జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశంలో చర్చించిందన్నారు. హకీంపేట గ్రామంలో 218 మంది రైతులకు 351 ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. సమ్మతి అవార్డు పొందిన రైతులకు ఒకే దఫాలో చెక్కుల ద్వారా నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఎకరానికి రూ. 20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు, అర్హత మేరకు ఇంటికో ఉద్యోగాన్ని కల్పించే వెసులుబాటు ఉన్నదని ఆయన వివరించారు. సమావేశం లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శారద, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ సుల్తానా, దుద్యాల తహసీల్దార్ కిషన్, హకీంపేట రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, ఫిబ్రవరి 3 : చిన్నారులకు ఈనెల 10న నులిపురుగుల నివారణ మాత్రలను పకడ్బందీగా పంపిణీ చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కరపత్రాలు, గోడ పత్రికలను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. 1 నుంచి 19 ఏండ్ల వయసున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలన్నారు. నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల తగ్గుతుందని, చదువుపై ఏకాగ్రత లోపించడంతో పాటు పలు రుగ్మతలకు లోనవుతారని.. వాటిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నదన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఒకటి నుంచి 19 ఏండ్ల వయసున్న పిల్లలు 8, 60,696 మంది ఉన్నారని.. వారందరికీ మాత్రలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఒకటి నుంచి రెండేండ్ల చిన్నారులకు సగం మాత్రను పొడి చేసి ఇవ్వాలని.. మూడు నుంచి 19 ఏండ్ల వరకు ఉన్న విద్యార్థినీవిద్యార్థులకు మాత్ర చొప్పున వేయించాలన్నారు. నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సక్సెస్ చేసేందుకు అధికారులందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 62 ఫిర్యాదులు వచ్చాయని.. వాటిలో రెవెన్యూకు సంబంధించి 44, ఇతర శాఖలవి 18 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన పోలీసులకు సన్మానం

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఏడు పతకాలు సాధించడం చాలా సంతోషంగా ఉన్నదని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్‌మీట్‌లో పతకాలు సాధించిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్‌లో జరిగిన మూడో తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్‌మీట్‌లో జిల్లా పోలీసులు ఏడు పతకాలను సాధించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు అంజాత్ పాషా, డేవిడ్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పతకాలు సాధించిన పోలీసు అధికారులు శివ దర్శన్, మన్సూర్, స్వాతి, ప్రకాశ్, శ్రీను, రవీందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

–ధారూరు, ఫిబ్రవరి 3

విద్యార్థులను ప్రోత్సహించాలి

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజాకుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 3 : అధ్యాపకులు ఆధునిక వ్యూహాలను అనుసరించి విద్యార్థులను ప్రోత్సహించాలని ఐఐటీ భువనేశ్వర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజాకుమార్ అన్నారు. మండలంలోని గుంతపల్లిలో ఉన్న అవంతి గ్రూప్ కళాశాలలో అధ్యాపక అభివృద్ధిపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ముందుగా అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంకతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. అధ్యాపకులు ఇంజినీరింగ్‌లోనే కాకుండా ఐఐటీలోనూ పాఠాలు చెప్పే స్థాయికి ఎదగాలన్నారు. ఒక నమూనా బాగుండాలంటే ముందుగా డిజైన్, పరిశోధన చాలా అవసరమని గుర్తు చేశారు. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల డైరక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రామచంద్రారెడ్డి, ఉమా మహేశ్వరరావు, పీఆర్వో శ్రీనివాస్‌నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేవెళ్ల మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు

చేవెళ్ల మండలానికి సంబంధించి 12 ఎంపీటీసీ స్థానాల ఫైనల్ జాబితాను విడుదల చేసినట్లు చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 17 నుంచి 12 తగ్గాయని.. ఇందులో ఎనిమిది పంచా యతీలను చేవెళ్ల మున్సిపల్‌లో కలుపగా.. ఐదు ఎంపీటీసీ స్థానాలను తొలగించడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చేవెళ్ల మండలానికి 12 ఎంపీటీసీ స్థానాలతో ఫైనల్ జాబితాను సోమవారం అధికారికంగా విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీవో విఠలేశ్వర్‌జీ, సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

- చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 3

రిమార్కులను సరిచేసుకోండి

ధారూరు, ఫిబ్రవరి 3 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎస్ఎన్‌సీయూ, ఎంహెచ్, ఎన్‌సీడీ సీ్కములో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా జిల్లా అధికారిక వెబ్‌సైట్ Vikarabad.telangana.gov.in లో పొందుపర్చినట్లు వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు జాబితాలో రిమార్క్స్‌లో సూచించిన అభ్యంతరాలను సరిచేసుకునేందుకు 04.02. 2025 నుంచి 07.02.2025 వరకు వెసులుబాటు ఉన్నదని, గడువు ముగిసిన తర్వాత ఎలాంటి అభ్యర్థనలను స్వీకరించామన్నారు.

ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు

సీఎం రేవంత్‌రెడ్డే కారణం

బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య

సిటీబ్యూరో: ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు సీఎం రేవంత్‌రెడ్డియే కారణమని బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయం వల్ల మహాలక్ష్మి ఉచిత బస్సు తీసుకొచ్చి ఆటో డ్రైవర్ల ఉపాధిపై దెబ్బకొట్టిందన్నారు. ఇంటి అద్దె, ఆటో కిస్తీలు, పిల్లలు చదువు, కుటుంబ అవసరాలు సమకూర్చుకోలేక ఆటో డ్రైవర్లు నరకం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 80కి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం స్పందించలదేని విమర్శించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ మేడ్చల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ .. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఏడాదికి రూ.12 వేలు ఇస్తానని మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇప్పుడు కొత్తగా డీజిల్ ఆటోలను ఔటర్ రోడ్డు బయటకు పంపించాలనుకుంటుందని.. అయితే వాటి స్థానంలో ఇందిరమ్మ పథకం ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాలు నేలమట్టం

శంషాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న సంపత్‌నగర్ కాలనీలో హెచ్ఎండీఏ పార్కు స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను సోమవా రం తెల్లవారుజామున హైడ్రా సీఐ తిరుమలేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బం ది కూల్చివేశారు. అదేవిధంగా ఊటుపల్లి ఇంద్రానగర్‌కాలనీలో రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలనూ నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సమయంలో వాటి నిర్మాణదారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

-శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 3

ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత మొదటిసారి మర్యాదపూర్వకంగా కలిసినట్లు నర్మదాకిష్టప్ప తెలిపారు. గతంలో బీఎస్పీలో ఉన్నప్పుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యలో ఎన్నో ఉద్యమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులున్నారు.

-కొడంగల్, ఫిబ్రవరి 3

మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడంపై సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ఆ పార్టీ నేతలు

నార్త్ సిటీ మెట్రోకు..

భూసార పరీక్షలు

సిటీబ్యూరో: నార్త్‌సిటీ మెట్రో నిర్మాణంలో మరో అడుగు ముందుకు పడింది. ప్రస్తుతం డీపీఆర్ తయారీపై హైదరాబాద్ మెట్రో సంస్థ దృష్టి పెట్టిన నేపథ్యంలో... మెట్రో నిర్మాణ ప్రక్రియలో భాగంగా పలు ప్రాంతాల్లో భూసార పరీక్షలతో భౌగోళిక అంశాలను పరిశీలిస్తున్నారు. పిల్లర్ల నిర్మాణం, మెట్రోస్టేషన్ల ఏర్పాటు వంటి అంశాల్లో భూసార పరీక్ష కీలకం కానున్నది. ఇప్పటికే నార్త్ సిటీలోని పలు ప్రాంతాల్లో బోరింగ్ విధానంలో మట్టిని సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫేస్-2 పార్ట్-బీ విస్తరణలో భాగంగా నార్త్ సిటీలో దాదాపు 45 కిలోమీటర్ల పొడవైన మెట్రో నిర్మాణానికి హెచ్ఏఎంఎల్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. ఇందులో జేబీఎస్ నుంచి సుచిత్ర వైపు, మరొక లైన్ శామీర్‌పేట వరకు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించగా, సుచిత్ర మార్గంలో పలు ప్రాంతాల్లో భూసార పరీక్ష ప్రక్రియలు జరుగుతున్నాయి. జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా భూమి లోపలి వరకు రంధ్రాలు చేసి అడుగు భాగంలో ఉండే మట్టిని సేకరిస్తారు. దీని ద్వారా మట్టి నాణ్యత, రాతి పొరలతోపాటు, నేల స్వభావం ఆధారంగా ప్రాజెక్టును పరిశీలించనున్నారు. దీనికి కనీసం నెలన్నర సమయం పట్టే అవకాశం ఉండగా... ప్రస్తుతం మేడ్చల్ మార్గంలో గుండ్లపోచంపల్లి, కొంపల్లి వంటి మార్గాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మేయర్ × కమిషనర్

కమిషనర్ ఇలంబర్తిపై మంత్రి పొన్నంకు మేయర్ ఫిర్యాదు .. తన పర్యటనలో కమిషనర్ హాజరు కాకపోవడంపై ఆగ్రహం

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తిల మధ్య అంతర్గత కోల్డ్‌వార్ కొనసాగుతున్నది. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కమిషనర్‌పై మేయర్ ఇటీవల ఫిర్యాదు చేయడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యమంత్రి కార్యాలయానికి సైతం మేయర్ ఇలంబర్తి వ్యవహారాన్ని తీసుకెళ్లినట్లు మేయర్ కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. గడిచిన కొన్ని రోజులుగా స్టాండింగ్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు పలు డివిజన్లలో మేయర్ పర్యటిస్తున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ముషీరాబాద్ తదితర నియోజకవర్గాల్లో పలు డివిజన్లలో మేయర్ పర్యటించి.. స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మేయర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు ఒక రోజు ముందుగానే కమిషనర్‌కు మేయర్ కార్యాలయం సమాచారం చేరవేరుస్తుంది. అయితే మేయర్ వరుసగా చేపట్టిన ఐదు పర్యటనల్లో కమిషనర్ పాల్గొనలేదు. కనీసం మేయర్ ఫోన్ చేసినా.. స్పందించడం లేదని మేయర్ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. క్షణం తీరిక లేకుండా జూమ్ మీటింగ్‌లు, సమావేశాలు ఉండటంతో మేయర్ పర్యటనలో కమిషనర్ వెళ్లడం సాధ్యపడలేదని, జోనల్ కమిషనర్లు, కింది స్థాయి అధికారులు మేయర్ పర్యటనలో ఉంటున్నారని కమిషనర్ కార్యాలయ వర్గాలు స్పష్టత ఇస్తున్నాయి. మొత్తంగా ఈ ఇద్దరి మధ్య నెలకొన్న అంతర్గత వార్ ప్రజా సమస్యలపై ప్రభావం పడకముందే సమన్వయంతో హైదరాబాద్ అభివృద్ధికి తోడ్పాడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమన్వయ సమావేశాలపై నిర్లక్ష్యం

సమగ్రాభివృద్ధికి, పౌరులకు సత్వర సేవలకు సంబంధించి కీలకమైన సమన్వయ సమావేశాలను జీహెచ్ఎంసీ నిర్వహించడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయ లేమితో నగర పౌరులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నది. ప్రధానంగా అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకాలు ఉత్పన్నమవుతూ సకాలంలో పనులు చేయలేకపోతుండడం, తద్వారా ప్రజలు అవస్థలు పడుతున్నారు. పుట్‌పాత్, జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్య మొదలు నాలా, రహదారుల వెడల్పు, భూసేకరణ, అనుమతుల్లో జాప్యం, విద్యుత్, జలమండలికి సంబంధించి ఏ పనులు చేయాలన్నా ఏదో ఓ సమస్య ఏర్పడుతున్నది. గతంలో సిటీ సమన్వయ కమిటీ తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టేవారు. జలమండలి, పోలీస్, విద్యుత్, పీసీబీ, తదితర శాఖల అధికారులు సభ్యులుగా ఉండగా, జీహెచ్ఎంసీ పెద్దన్న పాత్రను పోషించేది. ప్రతి నెలలో రెండు సార్లు కన్వర్జెన్సీ సమావేశాలు నిర్వహించేవారు. కానీ గడిచిన కొన్ని నెలలుగా ప్రభుత్వ శాఖలతో జీహెచ్ఎంసీ సమన్వయం కుదరడం లేదు.

ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలు వింటున్న బల్దియా కమిషనర్ ఇలంబర్తి

వ్యవహార శైలి వివాదాస్పదం

కొన్నిరోజులుగా కమిషనర్ ఇలంబర్తి వ్యవహార శైలి వివాదాస్పదమవుతూనే ఉంది. మేయర్, కార్పొరేటర్లను ఏమాత్రం పట్టించుకోకుండా కమిషనర్ అంతా తానై అన్నట్లు నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. స్టాండింగ్ కమిటీ ప్రతి వారం జరగడం లేదు. ఏజెండాలు లేవన్న సాకుతో వాయిదాలు పడుతూ వస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సైతం ఆలస్యమైందని సభ్యులు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా కమిషనర్ ఇలంబర్తి కార్పొరేటర్లకు సమయం ఇవ్వడం లేదని, డివిజన్లలో చాలా సమస్యలు పెరిగిపోతున్నా.. ప్రతిపాదనలను పట్టించుకోవడం లేదని, క్షేత్రస్థాయిలో అధికారులు కనీస ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు మండిపడుతున్నారు.